సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025



మెడికల్ సీట్లను వెనక్కి పంపిన దద్దమ్మ ప్రభుత్వం

పులివెందుల మెడికల్ కళాశాలకు 50 సీట్లు మంజూరైతే.. వెనక్కి పంపిన దద్దమ్మ ప్రభుత్వమిదని వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు. - 8లో



అధికారుల తీరుపై ఆందోళన

తమ సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని వేముల మండలం కె.కె.కొట్టాల గ్రామస్తులు యూసీఐఎల్ అధికారులపై మండిపడ్డారు. - 8లో

గరిష్టం/కనిష్టం
36.4 /24.6

వాతావరణం

జిల్లాలో సోమవారం 24.6 - 36.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

18న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే నిమిత్తం ఈనెల 18వ తేదిన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఒక ప్రకనలో తెలిపారు. కడప నగరశివార్లలోని టీటీడీసీ భవనంలో శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో వివిధ ఉద్యోగాల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బ్రాంచ్ మేనేజరు, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్స్, బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాల భర్తీ చేపడతామన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వీరభద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి



వీరభద్రస్వామి సన్నిధిలో శంకర్ బాలాజీ

చాపాడు : అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి కోసంకృషి చేస్తానని ఆలయ ఈఓ శంకర్ బాలాజీ తెలిపారు. మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం ఈఓగా శంకర్ బాలాజీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్‌తో కలిసి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఈయన మాట్లాడుతూ వీరభద్రస్వామి దేవాలయాన్ని పాలకవర్గంతో కలిసి అన్ని విధాలుగా అభివృద్ధి చేసి భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా తీర్చిదిద్దుతామని తెలిపారు.

పోటీ పరీక్షల్లో ప్రతిభ

– ఒకే సారి రెండు ఉద్యోగాలకు ఎంపిక



గురు గోవర్ధన్

కడప ఎడ్యుకేషన్ : కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించాడు కడపకు చెందిన మేకల గురు గోవర్ధన్ యాదవ్. తన మొదటి ప్రయతనంలోనే ఒకేసారి టీచర్ ఉద్యోగంతోపాటు సివిల్ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. ప్రతికూల పరిస్థితుల్లోనూ తన లక్ష్యం వైపు ముందుకు సాగి విజయం సాధించాడు. మేకల గురు గోవర్ధన్ యాదవ్,76.436 మార్కులతో 200 ర్యాంకుతో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు.మా అమ్మగారి కోరిక మేరకు కష్టపడి చదివి టీచర్ ఉద్యోగం సాధించినట్లు గోవర్ధన్ తెలిపారు. పేద విద్యార్థులకు మంచి విద్యను అందిస్తూనే తీరిక సమయంలో గ్రూప్-1 చదువుతానని పేర్కొన్నారు.

17 నుంచి స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్

కడప సెవెన్‌రోడ్స్ : ఈనెల 17 నుండి అక్టోబర్ 2 వరకు జరగబోయే 'స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా సచివాలయంలోని బోర్డ్ రూమ్‌లో పథకం అమలుకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులతో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జేసీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో,పట్టణ ఆరోగ్య కేంద్రాలలో, విలేజ్ హెల్త్ క్లినిక్‌లో, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో 474 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్పెషలిస్ట్ డాక్టర్లతో మహిళలకు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ రాజ్యలక్ష్మి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకం

కడప సెవెన్‌రోడ్స్ : సమాజ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో ఇంజినీర్ల పాత్ర అత్యంత కీలకమని, వారి సేవలు భావితరాలకు ఎంతో అవసరమని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సభా భవన్‌లో జిల్లా గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు ఇంజినీర్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హౌసింగ్, డ్వామా పీడీలు రాజా రత్నం, ఆది శేషారెడ్డి, మార్క్ ఫెడ్ ఈఈ, స్మార్ట్ కిచెన్స్ నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్ కుమార్ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలదండవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య సేవలు ప్రపంచ ఖ్యాతి పొందాయన్నారు.ఆయనను ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలన్నారు. గ్రామాల్లో చేపడుతున్న గృహనిర్మాణ పనులను లక్ష్యం మేరకు పూర్తిచేసిన ఇంజినీర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు హౌసింగ్ శాఖ తరపున.. ముఖ్య అతిథులు ప్రశంసా పత్రాలను అందజేశారు.

కేసులు పెట్టడం సరికాదు



అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకున్న కూటమి ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోంది. ప్రభుత్వ వ్యవస్థలో లోటుపాట్లను ప్రజలకు చూపిస్తుంటుంది. ఒక రాజకీయ నాయకుడు తమ పార్టీ విధానం మేరకు మాట్లాడితే దాన్ని ప్రచురించడాన్ని ప్రభుత్వం తప్పుగా చిత్రీకరించడం, కేసులు నమోదు చేయడం సరికాదు. వెంటనే సాక్షి ఎడిటర్‌పై కేసులను ఎత్తివేయాలి. – మూలె సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, జమ్మలమడుగు



ప్రజాస్వామ్యం ఖూనీ



ప్రజలకు వాస్తవాలను తెలిపే పత్రికలపై కూటమి ప్రభుత్వం కేసులు పెట్టడం, దాడులు చేయడం, వేధించడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ప్రభుత్వాలు శాశ్వతం కాదు. పత్రికా స్వేచ్ఛను హరిస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదం తలెత్తుతుంది. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా తప్పును తెలుసుకోవాలి. సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డితో పాటు ఇతర విలేకరులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి.

– ఆర్ రమేష్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, లక్కిరెడ్డిపల్లె

ఊరికి దారి దొరికింది..
ఉపకారికి బిల్లు దక్కలేదు!

- 200 సంవత్సరాలుగా ఉన్న సమస్య
- వంక వస్తే అంత్యక్రియలకు ఆటంకం
- వంక నీళ్లలోనే మృతదేహాలను వదిలేసే దుస్థితి
- చదువులకూ తప్పని తిప్పలు
- వైఎస్ జగన్ హయాంలో వంతెన నిర్మాణం
- తొలగిన అన్ని ఇబ్బందులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు
- బిల్లులు మంజూరు కాకపోవడంతో కోర్టు మెట్లెక్కిన వైనం



వైఎస్ జగన్ హయాంలో వంకకు అడ్డుగా నిర్మించిన వంతెన

కడప సిటీ : ఆ గ్రామం ఏర్పడి 200 సంవత్సరాలు పైబడి అయ్యింది. రాకపోకలకు గ్రామసమీపాన ఉన్న మొగమూరు వంక ప్రవాహంతో సమస్యలు తీవ్రతరంగా ఉండేవి. ఈ వంక పెద్ద ఎత్తున ప్రవహిస్తే మూడు రోజుల వరకు అన్ని కార్యకలాపాలు స్తంభించిపోయేవి. ఈ సమయంలో ఆ గ్రామంలో ఎవరైనా చనిపోతే మృతదేహాలను వంకలో ప్రవహించే నీటిలోనే వదిలేసే దుస్థితి. ఆ గ్రామంలో చదువుతున్న విద్యార్థులకు కూడా ఈ వంక ప్రవాహం పెద్ద ఆటంకంగా మారి చదువులు కుంటుపడేవి. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో అప్పటి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి చొరవతో ఆ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ బత్తల వీరయ్య యాదవ్ వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీంతో ఆ గ్రామానికి ఉన్న సమస్యలన్నీ తీరిపోయాయి. ఇది ఎక్కడో మారుమూల పల్లె కాదు... వైఎస్సార్ కడప జిల్లాలోని మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెకు అతి దగ్గరలో ఉన్న ఓబుల్‌రెడ్డిపల్లె.

200 సంవత్సరాలుగా ఉన్న సమస్య

ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామం ఏర్పడి 200 సంవత్సరాలకు పైగా అయ్యింది. అప్పటి నుంచి 2023 వరకు ఆ గ్రామ సమీపంలోని మొగమూరు వంక ప్రభావంతో వర్షాకాలంలో అన్ని విధాలుగా ఇబ్బందులు ఉండేవి. అప్పటి నుంచి 2022 వరకు ఆ గ్రామ సమస్యను ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రధాన రహదారికి దగ్గరలో ఉన్న గ్రామమైనప్పటికీ ఏ నాయకులు వారి సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపలేదు.

పద్మవ్యూహంలాంటిది

ఈ వంక వస్తే ఓబుల్‌రెడ్డిపల్లె వాసులకు అభిమన్యుడు పద్మవ్యూహంలో చిక్కుకున్నట్లు ఉండేది. అటు పాలగిరికి వెళ్లి మెయిన్‌రోడ్డుకు వచ్చేందుకు యేరు అడ్డు పడేది. నాగూరు మీదుగా వెళ్లి వేంపల్లెకు వెళ్లాలంటే పాములూరు వంక అడ్డుగా ఉండేది. ఈ వంక ప్రవాహం వస్తే ఎటువంటి రాకపోకలకు అవకాశమే లేదు. వంక ప్రవాహం తగ్గినంత వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేది.

గొర్రెల కాపరులకు తప్పిన ప్రమాదం

2022 నవంబరులో ఓబుల్‌రెడ్డిపల్లె సమీపాన ఉన్న వంక ఉధృతంగా ప్రవహించిన పరిస్థితి. ఆ సమయంలో తండ్రీ కొడుకులు ఆవుల ఎర్రన్న యాదవ్, బాల మునీంద్రయాదవ్‌లు వంకకు పైన తమకు చెందిన గొర్రెలు ఉండటంతో అక్కడికి చేరుకునేందుకు వంకను దాటాలని ప్రయత్నించారు. కాకపోతే ప్రవాహం ఉధృతంగా ఉండటంతో నీళ్లలో కొట్టుకుని పోతుండగా, ఒక కంపచెట్టును ఆశ్రయించి ప్రాణాలు దక్కించుకున్నారు. ఆ విషయాన్ని గ్రామస్తులు గమనించి అప్పటి ఎంపీపీ బత్తల వీరయ్య యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి దృష్టికి ప్రమాద ఘటన గురించి తెలియజేశారు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి బోట్ల సాయంతో తండ్రీ కొడుకులను ప్రాణాలతో రక్షించారు.

వంక వస్తే అంత్యక్రియలకు ఆటంకం

ఓబుల్‌రెడ్డిపల్లెకు గ్రామ పరిసరాల్లో ఉన్న మొగమూరు వంక వర్షాకాలంలో అన్ని రకాల ఇబ్బందులను కలగజేస్తున్న పరిస్థితి. ఒక్కొక్కసారి ఈ వంక భారీ స్థాయిలో వర్షాలు కురిసినపుడు మూడు, నాలుగు రోజుల వరకు ప్రవాహం తగ్గే పరిస్థితి ఉండదు. అలాంటి సమయంలో గ్రామంలో ఎవరైనా మృతి చెందితే వంకను దాటేందుకు వీలుగాక వంకనీళ్లలోనే మృతదేహాలను వదిలి అంత్యక్రియలను పూర్తి చేయాల్సిన దుస్థితి నెలకొనేది. గ్రామంలో కేవలం 5వ తరగతి వరకే చదువుకునే వీలుంది. 6వ తరగతి నుంచి పై తరగతులకు చదువుకునేందుకు వెళ్లేందుకు వేంపల్లె, వీరపునాయునిపల్లెకు వెళ్లాల్సి ఉంటుంది. వంక ప్రవాహం వల్ల చదువులకు తప్పని తిప్పలు కొనసాగేవి. చదువులు కుంటుపడేవి.

కోర్టు మెట్లెక్కిన కాంట్రాక్టర్

ఊరి మేలు కోసం వంతెన నిర్మాణం చేపట్టిన వీరయ్య యాదవ్ ఎన్నిమార్లు విన్నవించినా కూటమి ప్రభుత్వం బిల్లుల మంజూరు విషయంలో నిర్లక్ష్యం వహిస్తూ చివరకు ఒక్కపైసా కూడా చెల్లించకుండా మాటలతోనే సరిపెట్టారు. ఈ నేపథ్యంలో వీరయ్య యాదవ్ కోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చింది. గత ప్రభుత్వం చేసిన పనులకు బిల్లులు చెల్లిస్తే ఎక్కడ వైఎస్ జగన్‌కు మంచి పేరు వస్తుందనే ఉద్దేశ్యంతో బిల్లులకు ఎగనామం పెట్టినట్లు తెలుస్తోంది. ఇవన్నీ పక్కనపెట్టి గ్రామ సమస్యను తీర్చేందుకు చేపట్టిన వంతెన నిర్మాణానికి కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైఎస్ జగన్ హయాంలో వంతెన నిర్మాణం

2023 నవంబరులో ఎట్టకేలకు ఆ గ్రామస్తుల ఇబ్బందులు తొలగేందుకు వంకకు అడ్డంగా వంతెన నిర్మాణం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి చొరవతో ఎంపీపీ బత్తల వీరయ్య యాదవ్ పట్టుదలతో వంతెన నిర్మాణానికి సీఎండీఎ ఫ్, జీజీఎంపీ కింద రూ. 57 లక్షలు మంజూరైంది. ఇది లా ఉండగా బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేసరికి అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో ఒక్క పైసా కూడా వీరయ్య యాదవ్‌కు అందలేదు. కానీ ఊరి మేలు కోసం ఇబ్బందులు ఉన్నప్పటికీ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ వంతెన నిర్మాణంతో ఆ గ్రామానికి 200 సంవత్సరాలుగా ఉన్న ఇబ్బందులు తొలగిపోయాయి. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎస్.పాలగిరి వద్ద నిర్మించిన వంతెనను ప్రారంభిస్తున్న అప్పటి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి (ఫైల్)

అన్ని ఇబ్బందులు తీరాయి



ప్రధానంగా ఈ వంక ప్రవాహం వల్ల వర్షాకాలంలో మా ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. గ్రామం విడిచి ఎక్కడికి వెళ్లాలన్నా దిక్కు తోచని పరిస్థితి. వంక ప్రవాహం తగ్గినంత వరకు ఎక్కడికి వెళ్లేందుకు వీలుండేది కాదు. ప్రస్తుతం వంతెన నిర్మాణం పూర్తి కావడంతో అన్ని ఇబ్బందులు తొలగిపోయాయి.

– నీలం శివగంగరాజు, ఓబుల్‌రెడ్డిపల్లె

వంతెన నిర్మాణంతో ఆటంకం తొలగింది



వంతెన నిర్మాణం చేపట్టకముందు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారం. రాకపోకలకు తీవ్ర సమస్యగా ఉండేది. ముఖ్యంగా విద్యార్థులకు వీఎస్ పల్లె, వేంపల్లె పాఠశాలల్లో చదువుకునే వారికి ఆటంకం కలిగేది. ఈ వంతెన నిర్మాణం వల్ల మృతదేహాలకు అంత్యక్రియలు, విద్యార్థుల చదువులకు, రాకపోకలకు ఆటంకం లేకుండా జరిగిపోతున్నాయి.

– కొండెబోయిన గంగన్న, ఓబుల్‌రెడ్డిపల్లె

సమస్య తీరింది



వందల సంవత్సరాలుగా ఉన్న మొగమూరు వంక ప్రవాహంతో ఎంతో ఇబ్బందులు పడేవారం. నేను ఇబ్బంది పడినప్పటికీ మా గ్రామానికి స్వేచ్ఛగా రాకపోకలు కొనసాగించేందుకు వంతెన నిర్మాణం చేపట్టడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ వంతెన నిర్మాణానికి రూ. 57 లక్షలు మంజూరు కాగా, వంతెన నిర్మాణం కూడా పూర్తయి రాకపోకలు సాగుతున్నాయి. ఎన్నికల కోడ్ రావడంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బిల్లుల మంజూరుకు ఆటంకం ఏర్పడింది. ఆ తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించేందుకు సవాలక్ష కారణాలు చెబుతూ కాలాయాపన చేస్తూ రావడంతో కోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. – బత్తల వీరయ్య యాదవ్, మాజీ ఎంపీపీ, ఓబుల్‌రెడ్డిపల్లె

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

డీఆర్వో విశ్వేశ్వర నాయుడు



అర్జీలను స్వీకరిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజాసమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో డీఆర్వో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అర్జీల విచారణకు కింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని, అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి వారు అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, ఎస్డీసీ వెంకటపతి, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇవీ వినతులు

- లింగాల మండలం మురారి చింతల గ్రామానికి చెందిన తోట వెంకటకృష్ణ అనే వ్యక్తి మేము వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఊర్లో ఉన్న తమకు చెందిన భూమిని ఆక్రమించుకొని ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని, సమస్యను పరిష్కరించాలని విన్నవించారు.
- పొద్దుటూరు మండలం నడింపల్లి కి చెందిన షేక్ షాహిన అనే మహిళ భర్తను కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్నానని, నాకు ప్రభుత్వం మంజూరు చేసే వితంతు పింఛను మంజూరు చేయించాలని అర్జీని సమర్పించారు.

డీఎస్సీలో మూడో ర్యాంక్ సాధించిన హేమలత



హేమలత

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణంలోని రామేశ్వరానికి చెందిన హేమలత 43 ఏళ్ల వయసులో డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషు విభాగంలో మూడో ర్యాంక్, టీజీటీ ఇంగ్లీషులో 17వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను 2004లో ఎంఎస్సీ బయోటెక్నాలజీ పూర్తి చేశానన్నారు. వివాహం అయ్యాక తన భర్త పల్లేటి శ్రీనివాసులరెడ్డి ప్రోత్సాహంతో బీఈడీ పూర్తి చేసి ప్రైవేట్‌స్కూల్ టీచర్‌గా పనిచేశానన్నారు. 2012 డీఎస్సీలో సైన్స్ సబ్జెక్టు దరఖాస్తు చేసినప్పుడు డిగ్రీలో తన సబ్జెక్టులు బయో కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ కావడం, బోటని లేదా జువాలజీ ఉండాలన్న నియమంతో తన దరఖాస్తు రిజెక్ట్ అయిందన్నారు. తర్వాత ఎంఏ ఇంగ్లీషు పూర్తి చేసి 2018 డీఎస్సీలో 20వ ర్యాంకు సాధించాను. కానీ కేవలం రెండే పోస్టులు ఉండటంతో తనకు జాబ్ రాలేదన్నారు. అనంతరం ఇంటర్ కాలజీ ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేస్తూ 2025 డీఎస్సీకి ప్రయత్నించి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషులో 3వ ర్యాంక్, టీజీటీ ఇంగ్లీషులో 17వ ర్యాంక్ సాధించానన్నారు. ఎంఈడీ కూడా పూర్తి చేశానన్నారు. తన పెద్దకుమారుడు బీటెక్ ఫస్ట్ ఇయర్, రెండో కుమారుడు 9వ తరగతి చదువుతున్నాడన్నారు. వ్యవసాయం చేస్తూ తనకు సహాయ సహకారాలు అందించిన తన భర్త ప్రోత్సాహాన్ని, తన తల్లి సహకారాన్ని మరువలేనన్నారు.

శాంతిభద్రతలను పరిరక్షిస్తాం

జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పెల్కే నచికేత్ విశ్వనాథ్



ఎస్పీగా బాధ్యతలను స్వీకరిస్తున్న షెల్కే నచికేత్ విశ్వనాథ్

కడప అర్బన్ : జిల్లాలో పోలీస్ శాఖ పట్ల ప్రజలలో మరింత నమ్మకం పెంపొందించేలా శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని జిల్లా నూతన ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ముందుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా సాయుధ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వేదపండితుల ఆశీర్వచనాలతో జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని అధికారులు, మీడియా, ప్రజల భాగస్వామ్యంతో డ్రగ్స్, గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్, ఇతర అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై చాలా కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, అదనపు ఎస్పీ(ఏ.ఆర్) బి.రమణయ్య, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎస్.సుధాకర్, కడప డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు దారెడ్డి భాస్కర్ రెడ్డి, శివ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం తగదు

జిల్లాలో ప్రజా సమస్యలపై పోలీస్ అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని, విధుల్లో అలసత్వం ఉండరాదని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కడప సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, ఇతర ప్రత్యేక విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి మాట్లాడుతూ జిల్లాలో పర్యటించి శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధ్యయనం చేస్తామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

- పోలీసుల అధికారుల సంఘం నాయకులు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కడప జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేష్, వైస్ ప్రెసిడెంట్ శంకర్,స్టేట్ కో– ఆప్షన్ నెంబర్ ఎస్ఎం. డి. షఫీవుల్లా, ఆర్ ఎస్ ఐ రామస్వామి రాజు, ఎగ్జిక్యూటివ్ నెంబర్స్ ఏప్రిన్, మాధవి లత పాల్గొన్నారు.
- జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదు దారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోపు ప్రజాసమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఫేక్ రిజిస్ట్రేషన్ రద్దు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలంలోని ఎన్జీఓ కాలనీకి చెందిన ప్లాట్ నంబర్ 300 ఫేక్ రిజిస్ట్రేషన్‌ను జాయింట్ సబ్ రిజిస్ట్రార్ జీఎస్‌జీ రామదాసు సోమవారం రద్దు చేశారు. రిటైర్డు ఉద్యోగి గంజికుంట సుబ్బరాయుడుకు చెందిన కోట్ల రూపాయల ఈ స్థలాన్ని ఫేక్ డెత్ సర్టిఫికెట్లను తయారు చేసి కొంత మంది ముఠా అమ్మేశారు. గంజికుంట సుబ్బరాయుడు చనిపోయినట్లు ఆయన కుమారుడు సుబ్రహ్మణ్యం ఈ స్థలాన్ని కొండాపురం మండలం దత్తాపురం గ్రామానికి చెందిన వద్ది నాగరాజుకు విక్రయించినట్లు గత నెల 13న స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. ఈ విషయంపై సాక్షిలో 'బతికుండగానే చంపేశారు' అనే శీర్షికన శనివారం, 'ఫేక్ సర్టిఫికెట్లతో రిజిస్ట్రేషన్' అనే శీర్షికన సోమవారం కథనాలు ప్రచురితమయ్యాయి. ఇందుకు స్పందించిన రిజిస్ట్రార్ అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫేక్ రిజిస్ట్రేషన్ రద్దు చేశారు. సాధారణంగా ఫేక్ సర్టిఫికెట్లతో రిజిస్ట్రేషన్ చేసిన నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాల్సి ఉంది. అయితే బాధితుడు గంజికుంట సుబ్బరాయుడు వృద్ధాప్యంలో ఉన్న తనకు ముందు ఫేక్ రిజిస్ట్రేషన్ రద్దు చేసి తన స్థలాన్ని తనకు అప్పగించాలని కోరారు. ఈ సందర్భంగా జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ జీఎస్‌జీ రామదాసు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ సంఘటనపై తప్పనిసరిగా కేసు నమోదు చేయాల్సి ఉందన్నారు. తాను పోలీస్‌స్టేషన్, కోర్టుల వెంట తాను తిరగడానికి వయసు సహకరించబోదని చెప్పి ఫిర్యాదు ఇవ్వలేదన్నారు. ఈ కారణంగానే ప్రస్తుతానికి కేసు నమోదు చేయలేదని తెలిపారు. 9459/2025 గంజికుంట సుబ్బరాయుడు రద్దు చేసిన డాక్యుమెంట్ అని అన్నారు.

ఎమ్మార్పీ ధరలకే యూరియా విక్రయం

సాక్షి ఎఫెక్ట్..

రైతుల చెల్లింపులకు ఒరిజనల్ బిల్లులు ఇచ్చిన వ్యాపారులు

ప్రొద్దుటూరు రూరల్ : మొట్టమొదటి సారిగా ప్రొద్దుటూరులో సోమవారం ఒరిజనల్ బిల్లులతో ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించారు. మీడియాలో వచ్చిన కథనాలతో వ్యవసాయ శాఖ అధికారులు దగ్గరుండి అధిక రేట్లకు ఎరువుల విక్రయంపై సాక్షిలో 'అధికారుల సాక్షిగా అధిక రేట్లకు ఎరువుల విక్రయం'కథనంపై వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. సోమవారం జరిగిన యూరియా పంపిణీలో ఒరిజనల్ బిల్లులు ఇవ్వడంతోపాటు యూరియా బస్తా ఎమ్మార్పీ ధర రూ.267 పంపిణీ చేశారు. ప్రొద్దుటూరులో ఇన్నేళ్లుగా ఎంత మంది వ్యవసాయాధికారులు మారినా, జిల్లా వ్యవసాయాధికారి వచ్చి ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి వ్యాపారులకు, అధికారులకు ఆదేశాలు ఇచ్చినా వ్యాపారులు మాత్రం రైతు కొనుగోలు సరుకు సంబంధించి ఒరిజనల్ బిల్లులు ఎప్పుడు ఇవ్వలేదు. అంతేకాకుండా ప్రతి బస్తాపై రూ.30-50 వరకు అధిక రేట్లకు రైతులకు ఎరువులు విక్రయించేవారు.

55 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ

పట్టణంలోని కేవీఎస్ఆర్ ఫర్టిలైజర్స్‌లో 25 మెట్రిక్ టన్నులు, మహాలక్ష్మి ఫర్టిలైజర్స్‌లో 30 మెట్రిక్ టన్నులు యూరియా మంజూరు కాగా సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం పంపిణీ చేశారు. యూరియా కోసం రైతులు బారులు తీరారు. వ్యవసాయశాఖ అధికారులు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మంగళవారం కూడా యూరియా పంపిణీ మన గ్రోమోర్ కేంద్రంలో, మహాలక్ష్మి ఫర్టిలైజర్స్‌లో, మరికొన్ని రైతు సేవా కేంద్రాల్లో జరుగుతుందని మండల వ్యవసాయాధికారి వరహరికుమార్ తెలిపారు. రైతులు యూరియా ఎక్కువగా నిల్వ ఉంచుకోకూడదని, ఎంత వరకు అవసరమో అంత వరకు మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ప్రతి రైతుకు కావాల్సినంత యూరియా విడతల వారిగా దొరుకుతుందన్నారు. యూరియా దొరుకుతుందో లేదో అన్న సందేహం పెట్టుకోవద్దన్నారు.

క్లుప్తంగా

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

మైదుకూరు : అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మైదుకూరులో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మైదుకూరులోని ఎల్లమ్మ గుడి ప్రాంతంలో ఉన్న పట్టే రమేష్ (21) కొన్ని నెలల కిందట ఇల్లు కట్టుకునేందుకు రుణం తీసుకున్నాడు. పాత బట్టల వ్యాపారం చేసే ఈ యువకుడు అప్పు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడ్డాడు. రుణం చెల్లించే మార్గం లేక, ఇల్లు దక్కుతుందో లేదోననే భయంతో ఈ నెల 12వ తేదీన పురుగుల నివారణ మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఓబులేసు, తల్లి అయ్యవారమ్మ మైదుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వివాహిత అదృశ్యం


గీత (ఫైల్)

ముద్దనూరు : మండలంలోని ఆరవేటిపల్లె గ్రామానికి చెందిన గీత అనే వివాహిత అదృశ్యమైనట్లు సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు.. ఆరవేటిపల్లె గ్రామానికి చెందిన కత్తె జయసింహ కృష్ణ 2 ఏళ్ల క్రితం ముదిగుబ్బ మండలం మద్దన్నగారిపల్లె గ్రామానికి చెందిన గీతను పెళ్లి చేసుకున్నాడు. ఆదివారం జయసింహ పెద్దమ్మ చనిపోవడంతో ఆమెను చూడడానికి రాత్రి ఇంట్లోని వారందరూ వెళ్లారు. వారు ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత జయసింహ భార్య తాను కూడా మృతురాలిని చూసి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. రాత్రి 11 గంటల వరకు ఆమె ఇంటికి రాకపోవడంతో.. జయసింహ అక్కడికి వెళ్లి చూశాడు. అక్కడ తన భార్య కనిపించక పోవడంతో బంధువులతో కలిసి చుట్టుపక్కల విచారణ చేశాడు. అయినా ఆమె ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మెడికల్ సీట్లను వెనక్కి పంపిన దద్దమ్మ ప్రభుత్వం

- పులివెందుల మెడికల్ కళాశాల 90 శాతం పూర్తి
- కేవలం రూ.120 కోట్ల మేర పనులు పెండింగ్
- ప్రైవేటు పరం చేసేందుకు సిద్ధమైన కూటమి
- అలుపెరగని పోరాటాలతో అడ్డుకుంటాం
- వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల : పులివెందుల మెడికల్ కళాశాలకు 50 సీట్లు మంజూరైతే.. వద్దని వెనక్కి పంపిన దద్దమ్మ ప్రభుత్వమిదని కూటమిపై వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. సోమవారం పులివెందులలోని మెడికల్ కళాశాలను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, డీసీ గోవిందరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మెడికల్ కళాశాలలో పూర్తయిన నిర్మాణాలు, ఆసుపత్రి భవనాలు, నర్సింగ్ కళాశాలను పరిశీలిస్తూ.. పూర్తయిన భవనాలను మీడియా ప్రతినిధులకు చూపించారు. అనంతరం వారు మెడికల్ కళాశాల ఎదురుగా.. కళ్లు ఉండి చూడలేని సీఎం చంద్రబాబు డౌన్ డౌన్, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, రైతు విభాగపు నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, పులి సునీల్‌కుమార్, వేముల సాంబ శివారెడ్డి, సర్వోత్తమరెడ్డి, రసూల్, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా, పులివెందుల నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


పూర్తయిన పులివెందుల మెడికల్ కాలేజీ భవనాల వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు


మెడికల్ కళాశాల, వైద్యశాల పరిశీలనలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు

వైఎస్ పేరు తొలగింపు సరికాదు



పులివెందుల మెడికల్ కాలేజీ, వైద్యశాలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు తొలగించారు. కానీ ప్రజల గుండెల్లో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.542 కోట్లు ఖర్చు పెట్టి పులివెందుల మెడికల్ కాలేజీ నిర్మించారు. ఇంకా రూ.120 కోట్లు ఖర్చు అయ్యే పనులను పూర్తి చేయకుండా కూటమి ప్రభుత్వం అమ్మకానికి సిద్ధంగా ఉంచింది.

- పి.రవీంద్రనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ

విష ప్రచారం



2024 మార్చిలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల మెడికల్ కాలేజీ ప్రారంభించారు. కాలేజీ, హాస్పిటళ్లకు కావాల్సిన ఎక్విప్‌మెంట్ మొత్తం వైఎస్సార్‌సీపీ పాలనలోనే వచ్చేసింది. రోజుకు ఓపీ 500 నుంచి 1000 మంది వరకు వైద్య సేవలు పొందుతున్నారు. టీడీపీ ఆ పార్టీ స్థానిక ఎమ్మెల్సీని పంపించి పులివెందుల మెడికల్ కాలేజీ పూర్తి కాలేదని విష ప్రచారం చేయిస్తోంది. ప్రజలను మభ్యపెట్టాలని చూడటం తగదు.

- ఎస్‌బీ అంజద్ బాషా, మాజీ డిప్యూటీ సీఎం

పూర్తి కాకపోతే.. సీట్లు ఎలా కేటాయిస్తారు?



పులివెందుల మెడికల్ కళాశాలకు సీట్లు కేటాయిస్తే.. కూటమి వద్దని వెనక్కి పంపింది. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వ్యవస్థ వచ్చి చూసి 50 సీట్లు కేటాయించిందంటే.. మెడికల్ కళాశాల పూర్తయినట్లా, పూర్తి కానట్లా? మెడికల్ కళాశాల పూర్తి కాకపోతే ఈ కళాశాలకు 50 సీట్లు ఎందుకు కేటాయిస్తారు. కోట్లు వెచ్చించి నిర్మిస్తే అందుబాటులోకి తెచ్చి మెరుగైన విద్య, వైద్యం అందిచ్చాల్సింది పోయి ప్రైవేట్ పరం చేయడం ఏమిటి?

- రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ప్రొద్దుటూరు

జగన్‌కు పేరు వస్తుందనే ఉద్దేశంతోనే..



సామాన్య ప్రజలకు విద్య, వైద్యం అందించాలన్న ఉద్దేశంతో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశారు. వాటిని ప్రారంభిస్తే వైఎస్ జగన్‌కు మంచి పేరు వస్తుందన్న ఉద్దేశంతో ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర పన్నుతున్నారు. ప్రజలతో కలిసి అలుపెరని పోరాటాలు చేసి ప్రైవేటీకరణను అడ్డుకుంటాం. ప్రజలు కూడా అన్ని గమనిస్తున్నారు. త్వరలో కూటమికి బుద్ధి చెబుతారు.

- రఘురామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, మైదుకూరు

పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం



మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే.. పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుంది. కాలేజీలను అనుబంధంగా ఉన్న ఆస్పత్రులు కూడా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడంతో.. ఉచిత వైద్య సౌకర్యం పేదలు కోల్పోతారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నడూ లేని విధంగా మెడికల్ కళాశాలలను నిర్మింపచేసి అభివృద్ధి దిశగా తీసుకుని వెళ్లారు.

-పి.రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ

వైఎస్ కుటుంబానికి, చంద్రబాబుకు ఎంతో తేడా..



సమాజానికి ప్రాముఖ్యత ఇచ్చే విషయంలో వైఎస్ కుటుంబానికి, చంద్రబాబుకు ఎంతో తేడా ఉంది. ప్రభుత్వ ఆధీనంలోనే విద్య, ఆర్థిక రంగాలు ఉండాలని, వాటివల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలకు మేలు జరుగుతుందని వైఎస్ కుటుంబం పరితపించింది. కానీ సీఎం చంద్రబాబు ఎప్పుడూ ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేయడమే పనిగా పెట్టుకుంటారు.

- డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్సీ

17 మెడికల్ కళాశాలలు స్థాపన



వైఎస్ఆర్‌సీపీ పాలనలో 17 మెడికల్ కళాశాలలు స్థాపించారు. 2023- 24లో ప్రతి కళాశాలకు 150 సీట్ల చొప్పున 750 సీట్లు మొదటి సంవత్సరం వచ్చాయి. రెండవ సంవత్సరం 750 సీట్లు వచ్చాయి. మరో 5 కళాశాలలను అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో 5 కళాశాలలను ప్రారంచారు. అందుకు సంబంధించి పాడేరు, పులివెందుల మెడికల్ కళాశాల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కూడా ఇచ్చారు.

- నాగార్జునరెడ్డి, డాక్టర్స్ విభాగపు జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ

ఎర్రచందనం దుంగల పట్టివేత

చాపాడు : మండల పరిధిలోని నాగులపల్లె చెరువు కట్టపై ఆదివారం సాయంత్రం తరలించేందుకు సిద్ధం చేసుకుంటున్న నాలుగు ఎర్రచందనం దుంగలను పట్టుకుని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. ఖాదరపల్లి గ్రామానికి చెందిన షేక్ షఫీ, జిలాని అనే వ్యక్తులు నాలుగు ఎర్రచందనం దుంగలను తరలిస్తుండగా దాడులు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. వారిని అరెస్టు చేసి, దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

యూసీఐఎల్ అధికారుల తీరుపై ఆందోళన

సమస్యలు పరిష్కరించాలని కె.కె.కొట్టాల వాసుల డిమాండ్

పులివెందుల టౌన్ : తమ సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని పులివెందుల నియోజకవర్గ పరిధిలోని వేముల మండలం కె.కె.కొట్టాల గ్రామస్తులు యూసీఐఎల్ అధికారులపై మండిపడ్డారు. సోమవారం పులివెందులలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ చిన్నయ్య నేతృత్వంలో యూసీఐఎల్ అధికారులు జీఎం సుమన్ సర్కార్, డీజీఎం విజయకుమార్, భూసేకరణాధికారి నవీన్ కుమార్‌రెడ్డితో గ్రామస్తులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ టైలింగ్ పాండ్, ఇతర కారణాల వల్ల తమ గ్రామంలో ఆరోగ్య పరిస్థితులు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. సీఎస్ఆర్ నిధుల కింద ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని, తమ గ్రామంలో అవసరమైన తాగునీరు, విద్య, వైద్య సౌకర్యాలు కూడా కల్పించలేదని ధ్వజమెత్తారు. తాజాగా టైలింగ్ పాండ్ నిర్మాణం ఎత్తు పెంచుకుంటూ పోతున్నారని, దానివల్ల తమ గ్రామస్తులకు జరిగే అన్యాయం, కష్టం, నష్టం గుర్తించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామానికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి, పునరావాసం కింద తమకు తగిన వసతులు కల్పించి, గ్రామం మొత్తాన్ని యూసీఐఎల్ పరిధిలోకి తీసుకుని తమను ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా యూసీఐఎల్ జీఎం సమాధానమిస్తూ గ్రామస్తుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరగా పరిష్కారమయ్యేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చిన్నయ్య, డీజీఎం విజయకుమార్, భూసేకరణ అధికారి నవీన్ కుమార్ రెడ్డి, ఆలూరు రాజేష్ బాబు, సర్పంచ్ రంగనాథం, మోహన్ బాబు, రాజేష్, శివ పాల్గొన్నారు.


కె.కె.కొట్టాల గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య

ఆర్టీపీపీ నుంచి గుట్టుగా స్క్రాప్ తరలింపు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు పరిశ్రమ నుంచి గుట్టు చప్పుడు కాకుండా పాత ఇనుము (స్క్రాప్)ను కొందరు బయటికి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆర్టీపీపీలోని 600 మెగావాట్ల ప్రాజెక్టు పనులు కొన్నేళ్ల కిందట పూర్తి అయ్యాయి. అందులో భాగంగా స్క్రాప్ (పాత ఇనుప ముక్కలు) నిలువ పేరుకుని పోయింది.

అయితే ఇలా పక్కన పడి ఉన్న స్క్రాప్‌ను పరిశ్రమ యజమాన్యం టెండర్ల ద్వారా అమ్మకం వీలు ఉన్నప్పటికీ.. ఏ కారణం చేతనో చర్యలు తీసుకోవడం లేదు. తాజాగా ఎన్డీఏ కూటమికి చెందిన కొందరు స్క్రాప్‌పై కన్నేశారు. సంబంధిత అధికారులకు రాజకీయ వత్తిళ్లు కూడా లేకపోలేదు. గుట్టు చప్పుడు కాకుండా స్క్రాప్ బయటకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని కార్మిక వర్గాల ద్వారా తెలుస్తోంది. తాజాగా ఆర్టీపీపీ నుంచి బయటికి వెళ్తున్న స్క్రాప్ వాహనాన్ని పట్టుకోవడం, వదిలి పెట్టడటం కూడా జరిగిందని తెలుస్తోంది. సంబంధిత అధికారులపై రాజకీయ వత్తిళ్లు రావడంతో ఆ వాహనాన్ని వదిలేసినట్లు ప్రచారం జోరుగా జరుగుతోంది. పట్టుకున్న వాహనం సచివాలయ వద్ద ఉంచి మంతనాలు చేసిన తర్వాత.. వదిలి వేసినట్లు సమాచారం. కూటమి నేతలు ఆర్టీపీపీని ఆదాయ వనరుగా మర్చుకున్న విషయం బహిరంగ రహస్యం. ఆర్టీపీపీలో పని చేస్తున్న కొందరి సహాయ సహకారాలు ఉండటం వల్ల స్క్రాప్ సులువుగా బయటకు పోతుంది. ఆర్టీపీపీ ప్రధాన గేట్ల వద్ద సీసీ కెమెరాలు ఉన్నాయని, ఏ విధంగా బయటికి పోతుందో సులువుగా తెలుసుకోవచ్చు. అయినా ఏ కారణం చేతనో సంబంధిత అధికారులు పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు విధినిర్వహణలో నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఈ విషయంపై ఆర్టీపీపీ సీఈ వాసుదేవరావును వివరణ కోరాగా.. ఆరా తీస్తామన్నారు. ఈ వ్యవహారం తన దృష్టికి రాలేదన్నారు. ఏదిఏమైనా విచారణ చేస్తామని, సంబంధిత వారిపై చర్యలు ఉంటాయన్నారు. అనంతరం కలమల్ల ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. అయినా ఆర్టీపీపీలోని అన్ని విభాగాల అధికారులతో సంప్రదించి విచారణ చేస్తామన్నారు. ఆర్టీపీపీ అధికారులు ఫిర్యాదు చేయలేదన్నారు. ఫిర్యాదు చేస్తే విచారణ చేపడుతామని తెలిపారు.


ఆర్టీపీపీ నుంచి బయటికి ట్రాక్టర్‌లో వచ్చిన స్క్రాప్

సౌత్‌జోన్ అండర్–23 మల్టీ డే మ్యాచ్‌లు ప్రారంభం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ సౌత్‌జోన్ అండర్–23 మల్టీ డే మ్యాచ్‌లు సోమవారం ప్రారంభం అయ్యాయి. కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు–చిత్తూరు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 89 ఓవర్లకు 8 వికెట్లు కోల్పోయి 375 పరుగులు చేసింది. ఆ జట్టులోని భవాని ప్రసాద్ 62, నిఖిత్ గౌడ్ 110 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని కనిష్ 4, సాయి సూర్య తేజరెడ్డి 2 వికెట్లు తీశారు.

వైఎస్ఆర్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో..

వైఎస్ఆర్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప–అనంతపురం జట్లు పోటీపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 364 పరుగులు చేసింది. మహేంద్రారెడ్డి 142, వికాస్ 85 పరుగులు చేశారు. కడప జట్టులోని ఎస్ఎండీ ఆయూబ్ 1, చెన్నారెడ్డి 1, నరసింహ 1 వికెట్ తీశారు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

నీట మునిగిన ఎద్దుల బండి

'నా కళ్ల ముందే రెండు ఎద్దులు చనిపోయాయంటూ' ఓ రైతు విలపించిన తీరు అందరి కళ్ల వెంట కన్నీరు తెప్పించింది. ప్రమాదవశాత్తూ వాగు నీటి ప్రవాహంలో బండి చిక్కుకుని రెండు ఎద్దులు మృతి చెందగా.. రైతు స్థానికుల సాయంతో బయటపడ్డాడు.

- రెండు ఎద్దులు మృతి
- ప్రాణాలతో బయటపడిన రైతు

ఖాజీపేట : ఖాజీపేట మండలంలో విషాద ఘటన జరిగింది. తుడుమలదిన్నె వంకకు అకస్మాత్తుగా పెరిగిన వరద నీటి వల్ల రెండు ఎద్దులు మృతి చెందాయి. ఎద్దుల బండిపై వెళుతున్న రైతు ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సుంకేశుల గ్రామానికి చెందిన మద్దూరి ఆదిరెడ్డి తన సేద్యపు ఎద్దులు తీసుకుని తుడుమలదిన్నె ఎస్సీ కాలనీలోని ఒక రైతు పొలంలో భూమి చదును చేసేందుకు వెళ్లాడు. పనులు పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణంలో తుడుమలదిన్నె గ్రామం ఎస్సీ కాలనీకి మధ్యలో ఉన్న.. వేగుల వాగును దాటుతుండగా ఆకస్మాత్తుగా నీటి ప్రవాహం పెరిగింది. అయినా ఆదిరెడ్డి అలాగే వెళ్లే ప్రయత్నం చేశాడు.. ఈక్రమంలో ప్రమాదానికి గురయ్యాడు. వాగు దాటే క్రమంలో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో.. ఎద్దుల బండి పడిపోయింది. ఎద్దులను బండికి కట్టి ఉండటంతో కొట్టుకు పోయాయి. అలాగే బండి పైన ఉన్న ఆదిరెడ్డి సైతం వాగులో పడిపోయాడు. పక్కనే ఉన్న చెట్టును పట్టుకోవడంతో ప్రాణాలతో బయట పడ్డాడు. స్థానికులు అక్కడికి చేరుకుని పెద్ద తాడు వేసి ఆదిరెడ్డిని బయటకు తీసుకొచ్చారు. ఎద్దులను కూడా అతికష్టం మీద బయటకు తీసుకొచ్చారు. అప్పటికే రెండు ఎద్దులు మృతి చెందాయి. వాగులోని బండిని సైతం స్థానికులు బయటకు తీసుకు వచ్చారు. స్థానికుల సమాచారంతో ఖాజీపేట సీఐ వంశీధర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బిడ్డల్లా చూసుకుంటున్న ఎద్దులు చనిపోవడంతో రైతు కన్నీటి పర్యంతమయ్యారు. రైతుకు న్యాయం చేయాలని స్థానికులు అధికారులను కోరారు. ప్రవాహం తగ్గేవరకూ ఎవరూ వంకను దాటవద్దని సీఐ గ్రామస్తులకు సూచించారు.


మృతి చెందిన ఎద్దుల వద్ద గుమికూడిన జనం

ముంపు.. ముప్పు

- ముంచుకొస్తున్న సోమశిల వెనుక జలాలు
- ఆగిన వాహన రాకపోకలు
- 28 గ్రామాల ప్రజలకు అవస్థలు


సగిలేరు నది వంతెన పైకిచేరిన సోమశిల జలాశయం వెనుక జలాలు


ప్రమాదం అంచున నడుముల లోతు నీటిలో వెళ్తున్న సమీప గ్రామాల ప్రజలు

అట్లూరు : వేగంగా వస్తున్న ముంపు జలాలతో.. ముప్పు పొంచి ఉంది. సోమశిల జలాశయంలో రోజురోజుకు నీరు పెరుగుతోంది. పూర్తి స్థాయి సామర్థ్యానికి చేరువలో ఉంది. దీంతో అట్లూరు మండల పరిధిలోని సగిలేరు నదికి భారీగా జలాలు వస్తున్నాయి. వేములూరు దగ్గర సగిలేరు నదిపై ఉన్న లోలెవల్ వంతెన పైకి సోమశిల వెనుక(ముంపు) జలాలు ముంచుకొస్తున్నాయి. లోలెవల్ వంతెన నీట మునగడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో 28 గ్రామాల ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 78 టీఎంసీలు కాగా 69 టీఎంసీలు దాటితే సగిలేరు నది వంతెనపైకి చేరుతాయి. ప్రస్తుతం సోమశిలలో 74.5 టీఎంసీలు ఉన్నాయి. దీంతో సోమవారం నాటికి వంతెనపైకి మూడు అడుగుల మేర నీరు చేరింది.


చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి

మండల నడిబొడ్డున సగిలేరు ఉంది. ఈ నదికి తూర్పు భాగాన కమలకూరు, మణ్యంవారిపల్లి, మాడపూరు, కామసముద్రం, వేములూరు, ముత్తుకూరు గ్రామ పంచాయతీలు ఉండగా.. వాటిలో 28 గ్రామాలు ఉన్నాయి. అలాగే పడమర భాగాన 6 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండల కార్యాలయాలతోపాటు పోలీస్‌స్టేషన్ సహా సగిలేరు నదికి పడమర ఉన్న మండల కేంద్రమైన అట్లూరులో ఉన్నాయి. సాధారణంగా ఆ గ్రామాల వారు మండల కేంద్రమైన అట్లూరుకు ఆరు కిలో మీటర్ల దూరం ప్రయాణించే వెళ్లే వారు. కానీ వంతెన నీట మునగడంతో.. బద్వేలు మీదుగా వెళ్లాల్సి రావడంతో 40 కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సి వస్తోంది.

రైతులకు తప్పని తిప్పలు

సగిలేరు నదికి ఇరువైపులా కొంత మంది రైతుల పొలాలు ఉన్నాయి. వంతెనపై నీరు చేరవడంతో.. పొలాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. నడుములలోతు వరకు నీరు వచ్చింది. ప్రమాదం అని తెలిసినా కొంత మంది అదే నీటిలో నడుచుకుంటూ వెళ్తున్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా సగిలేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

హైలెవల్ వంతెన నిర్మించాలి



సోమశిల జలాశయానికి నీళ్లు ఎక్కువ వచ్చినప్పుడల్లా.. కష్టాలు తప్పడం లేదు. ఏటా ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నాం. ఈ విషయంపై కొన్నేళ్లుగా అధికారులకు విన్నవిస్తున్నా ఫలితం లేదు. హైలెవల్ వంతెన నిర్మిస్తేనే ఇక్కడి ప్రజల కష్టాలు తీరుతాయి.

- రాజఓలు సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు, కామసముద్రం

వంతెనపై వెళ్లడం ప్రమాదం



వంతెనపైకి నీరు చేరడంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. అయితే కొంత మంది నీటిలోనే నడచుకుంటూ ప్రయాణం చేస్తున్నట్లు తెలిసింది. ఇది ప్రమాదం.. ఎవరూ వెళ్లవద్దు. ముందస్తుగా సిబ్బంది చేత కంప వేయించాం.

- సుబ్బలక్షుమ్మ, తహసీల్దారు, అట్లూరు

అవగాహన కల్పిస్తున్నాం



వంతెనపై చేరిన సోమశిల ముంపు జలాల్లో ఎవరూ దాటే ప్రయత్నం చేయరాదు. ప్రమాదం అని తెలిసినా కొంత మంది వంతెనపై వెళ్తున్నారు. సగిలేరు నదికి ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

- రామకృష్ణ, ఎస్ఐ, అట్లూరు